ప్రజాశక్తి

సోమవారం 26 ఫిబ్రవరి 2024 | 5 | శ్రీ సత్యసాయి

గ్రూప్-2 పరీక్ష రాసేందుకు అనంతపురంలోని ఓ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు (హిందూపురంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

నేడు 'అనంత'లో రాష్ట్ర పునర్ నిర్మాణ సభ

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో బహిరంగ సభ
- ముఖ్య అతిథిగా ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరు
- పాల్గొననున్న సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, రామకృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారాన్ని సోమవారం నుంచి మొదలు పెడుతోంది. ఈ మేరకు రాష్ట్ర పునర్ నిర్మాణ సభ పేరుతో అనంతపురం నగరంలో నేడు బహిరంగ సభ నిర్వహించనుంది. నగరంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఈ సభ జరుగనుంది. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ఈ సభ కోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారీ వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా ఈ సభకు హాజరవుతున్నారు. ఈయనతోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణలు పాల్గొంటున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జీ మాణిక్యం ఠాకూర్, పిసిసి అధ్యక్షురాలు షర్మిల, సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, మాజీ పిసిసి అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్‌లు పాల్గొంటున్నారు. రఘువీరారెడ్డి, శైలజానాథ్ ఇద్దరూ జిల్లాలోని పలు చోట్ల పర్యటించి, జనసమీకరణపైనా దృష్టి సారించారు.

భారీ హోర్డింగ్‌లు... కాంగ్రెస్ జెండాలు..

ఎఐసిసి అధ్యక్షులు హాజరవుతున్న సభకు భారీ ఏర్పాట్లనే కాంగ్రెసు పార్టీ చేపడుతోంది. నగరంలోని జూనియర్ కళాశాలలో సభ జరిగే ప్రాంగణం చుట్టు భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. అందులో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలతోపాటు రాజశేఖర్‌రెడ్డి ఫొటోతో పెద్దఎత్తునే ఏర్పాటు చేశారు. చుట్టూ కూడా ఇదే రకమైన ఫ్లెక్సీలు హోర్డింగ్‌లతో నింపారు. నగరంలోని ప్రధాన కూడళ్లలోనూ కాంగ్రెసు పార్టీ జెండాలతో అలంకరించారు. ముఖ్య నాయకులకు స్వాగతంపలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

జూనియర్ కళాశాలలో బహిరంగ సభకు కోసం ఏర్పాటవుతున్న సభావేదిక

రాష్ట్ర విభజన హామీలే ప్రధానం. ?

రాష్ట్ర విభజన హామీలే ప్రధాన అజెండాగా ఉండే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. విభజన సమయంలో రాష్ట్రానికి కాంగ్రెసు పార్టీ ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ లాంటి అనేక హామీలిచ్చింది. 2014 తరువాత అధికారంలోకి వచ్చిన బిజెపి ఈ హామీలు వేటినీ అమలు చేయలేదు. వీటిని ప్రశ్నించే విషయంలో రాష్ట్రంలోని పార్టీలు టిడిపి, వైసిపిలు రెండూ వెనుకాడుతున్నాయి. ఈ అంశాలను ఈ సభలో కాంగ్రెస్ ఎత్తి చూపనుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

బహిరంగ సభావేదిక వద్ద కాంగ్రెస్ ముఖ్యలతో ఏర్పాటు చేసిన బ్యానర్లు

కాంగ్రెస్ పునర్ నిర్మాణానికి బాటలు వేసేనా ?

రాష్ట్ర పునర్ నిర్మాణం పేరుతో కాంగ్రెసు చేపట్టిన ఈ సభ ద్వారా రాష్ట్రంలో కాంగ్రెసు పునర్ నిర్మాణానికి ఏ మేరకు బాటలు పడనున్నాయన్నది రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెస్ ఇక్కడ పూర్తిగా దెబ్బతింది. దశబ్దకాలంగా పార్టీని తిరిగి పునర్ నిర్మాణం చేపట్టేందుకు అనేక ప్రయత్నాలు జరిగినా ఆశించిన ఫలితం దక్కలేదు. అయితే ఇటీవల జరిగిన రాష్ట్రాల ఎన్నికల్లో పక్కనున్న కర్నాటక, తెలంగాణల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇక్కడా పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదుకోసం అనేక ప్రయత్నాలు చేసే పనిలో పడ్డారు. సీనియర్ నాయకులను పార్టీలో చేర్చుకుని తిరిగి పార్టీని బలోపేతం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అవి ఏ మేరకు ఫలిస్తాయన్నది చూడాల్సి ఉంది.

ప్రశాంతంగా గ్రూప్- 2 పరీక్ష

7015 మంది హాజరు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి 01:00 గంటల వరకు పరీక్షలు జరిగాయి. జిల్లాలో 28 పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలు రాశారు. పరీక్షలకు 8239మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 7015 మంది హాజరయ్యారన్నారు. 1224 మంది అభ్యర్థులు గైర్హాజరు అయ్యారన్నారు. 85.14 శాతం హాజరు నమోదు అయ్యింది. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డిలు పరిశీలించారు.

హిందూపురం : పట్టణంలో జరిగిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రి కళాశాల, ఎంజిఎం పాఠశాల కేంద్రాలను ఎస్పీ మాధవరెడ్డి సందర్శించి పోలీసు బందోబస్తును సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు. ఆయన వెంట హిందూపురం డిఎస్‌పి కంజాక్షన్, పోలీస్ అధికారులు ఉన్నారు.

నిన్న ఉన్న అసంతృప్తి నేడు లేదు..!

- ఏపీ రాజకీయాల్లోకి షర్మిల ముందే రావాల్సింది
- అందరి లక్ష్యం జగన్ ఓటమే
- మాజీ ఎంపీ జెసి.దివాకర్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న జెసి.దివాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి టికెట్ల ప్రకటనపై 'నిన్న ఉన్నంత అసంతృప్తి నేడు లేదు.' అంటూ మాజీ ఎంపి జెసి.దివాకర్‌రెడ్డి తెలిపారు. చాలా కాలం తరువాత ఆయన మీడియా ముందుకొచ్చి రాజకీయాలపై మాట్లాడారు. ఆరోగ్య సమస్యలతో కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చిన ఆయన ఆదివారం సాయంత్రం అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. టిక్కెట్ల ప్రకటన అనంతరం టిడిపిలో చెలరేగిసన అసంతృప్తులు పాలపొంగు వంటివని చెప్పారు. నిన్న ఉన్నంత టెన్షన్ నేడు లేదని పేర్కొన్నారు. ఎలాగైనా వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని గద్దె దింపడమే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లక్ష్యమని చెప్పారు. అందుకోసమే వారిద్దరికీ ముఖ్యమైన వారు ఉన్నప్పటికీ పరిస్థితుల దృష్ట్యా టిక్కెట్టు ఇవ్వలేదని తెలిపారు. ఇక వైఎస్.షర్మిల ట్రైన్ మిస్సయిందని చెప్పారు. ఆమె తెలంగాణ రాజకీయాల్లోకి కాకుండా మొట్టమొదటే ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టి ఉండే పరిస్థితి వేరే విధంగా ఉండేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అనంతపురం జిల్లాలో 12 స్థానాల్లో టిడిపి గెలుస్తుందని జోష్యం చెప్పారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలన ఏ మాత్రం బాగోలేదని చెప్పారు. హిట్లర్ పాలనను తలపిస్తోందని విమర్శించారు. ఇప్పుడు విడుదల చేసిన టిడిపి అభ్యర్థుల జాబితా చూసి వైసిపి కూడా భయపడుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యమన్న ధీమా వ్యక్తం చేశారు. ఆయన కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డికి టిక్కెట్టు అంశాన్ని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా తనకు తెలియదని, అయితే తన కుమారుడు పవన్, సోదరుడు జెసి.ప్రభాకర్‌రెడ్డిలు అధిష్టానాన్ని కలసి మాట్లాడారన్నారు. కుటుంబానికి ఒక్క టికెట్ అన్న విషయం తమకు చెప్పలేదని తెలిపారు.

సెబ్ సిబ్బందిపై దాడి

కానిస్టేబుల్, డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి-పరిగి

పరిగి మండలం ఆంధ్రా సరిహద్దు ప్రాంతం కర్ణాటకలోని ఇట్లాపురం సమీపంలో హిందూపురం సెబ్ పోలీసులపై కర్ణాటక మద్యం అమ్మకదారులు దాడికి పాల్పడ్డారు. శనివారం రాత్రి జరిగిన ఈ దాడిలో ఓ కానిస్టేబుల్, డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ శ్రీరాములు విలేకరులకు వెల్లడించారు. ఎన్నికల సమయంలో కర్నాటక నుంచి పరిగి మండలం మీదుగా కర్నాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో సెబ్ అధికారులు అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ సమయంలో శనివారం రాత్రి ఇట్లాపురం వద్ద కొంతమంది దుండగులు ద్విచక్రవాహనంలో కర్నాటక మద్యాన్ని తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. అక్రమ మద్యాన్ని కానిస్టేబుల్ వెంకటేష్, వాహన డ్రైవర్ పురుషోత్తంలు స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈసమయంలో దుండుగులు కానిస్టేబుల్ వెంకటేష్, డ్రైవర్ పురుషోత్తంపై దాడి చేసి అక్కడి నుంచి వారొచ్చిన ద్విచక్రవాహనంలోనే పారిపోయారు. దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. దాడి చేసిన వారిని గుర్తించే పనిలో ఉన్నామని, త్వరలోనే వారిని పట్టుకుంటామని సెబ్ సిఐ తెలిపారు.

గాయపడిన కానిస్టేబుల్ వెంకటేష్,జీప్ డ్రైవర్ పురుషోత్తం

టిడిపిలో ఆ మూడు స్థానాలపై ఉత్కంఠ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బరిలో నిలిచే టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థులను శనివారం నాడు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇందులో శ్రీ సత్యసాయి జిల్లాకు సంబంధించి మూడు నియోజకవర్గాలు మినహా మిగిలిన స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. సత్యసాయి జిల్లాలో మొత్తం ఆరు నియోజకవర్గాలు ఉండగా ఇందులో అధిష్టానం మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల అభ్యర్థులను మాత్రం ప్రకటించలేదు. దీంతో ఈ నియోజకవర్గాల్లో అభ్యర్థి ఎవరన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. పుట్టపర్తిలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి కాకుండా ఆయన తనయుడు వెంకట కృష్ణకిషోర్ లేదా పల్లె కోడలు పల్లె సింధూర రెడ్డికి టికెట్టు ఇవ్వొచ్చన్న ప్రచారం నడుస్తోంది. వీరితో పాటు కొందరు బీసీ నేతలు కూడా టికెట్టుపై ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధికార పార్టీని ఢీకొనాలంటే పల్లె కుటుంబానికే సాధ్యమని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కదిరి నియోజకవర్గంలో కందికుంట వెంకటప్రసాద్‌కే టికెట్టు కేటాయిస్తారని ఆయన మద్దతుదారులు బలంగా చెబుతున్నారు. మొదటి విడతలోన ఆయన పేరు ఉంటుందని భావించిన కందికుంట అభిమానులకు పేరు లేకపోవడం ఒకింత ఆందోళనకు గురి చేస్తోంది. ధర్మవరం అభ్యర్థి విషయంపై కూడా పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం ఇక్కడ టిడిపి ఇన్‌ఛార్జిగా పరిటాల శ్రీరామ్ ఉన్నారు. టికెట్ తనక వస్తుందని ఆయన పలు సమావేశాల్లో ధీమా వ్యక్తం చేశారు. ఇదే నియోజకవర్గం నుంచి మాజీ శాసనసభ్యుడు గోనుగుంట్ల సూర్యనారాయణ టికెట్టును ఆశిస్తున్నారు. తనకు ఖచ్చితంగా టికెట్టు వస్తుందని, 2024లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలవబోతున్నాను అంటూ ఆయన పలు సమావేశాలు తెలియజేశారు. వీరితో పాటు ఇక్కడ జనసేన అభ్యర్థి చిలకం మధుసూదన్‌రెడ్డి కూడా టికెట్‌ను ఆశిస్తున్నారు. ఈ ముగ్గురిలో ధర్మవరం టికెట్ ఎవరికి వస్తుందన్న దానిపై ఇంకా ఉత్కంఠ వీడలేదు. మొత్తం మీద కదిరి, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థులుగా ఎవరిని బరిలో నిలుపుతారన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ లబ్ధి

బీసీ, ఈబీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

'ప్రభుత్వం బీసీ, ఈబీసీ, కాపులకు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అర్హులందరికీ అందించేందుకు కృషి చేస్తున్నాం. బీసీలు, ఈబీసీలు, కాపులకు ప్రతి ఏటా ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.10 వేలు ప్రకారం ప్రభుత్వం చేయూతను అందిస్తోంది. జగనన్న చేదోడు కింద రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లు, ఈబీసీలు బలిజ, వెలమ, గాజుల తదితర కాపులకు కాపు నేస్తం కింద ఏటా కోట్లాది రూపాయలను అందిస్తోంది. ఈ నేపథ్యంలో గత నాలుగు సంవత్సరాలుగా శ్రీ సత్యసాయి జిల్లాలో ఈ వర్గాలకు ప్రభుత్వ సాయాన్ని అందించి ప్రోత్సహిస్తున్నాం'. అని బీసీ, ఈబీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న:శ్రీ సత్యసాయి జిల్లాలో బీసీలకు జగనన్న చేదోడు వైఎస్సార్ ఈ బీసీ నేస్తం, వైఎస్సార్ కాపు నేస్తం కింద నాలుగేళ్లలో ఎంత సాయం అందించారు.

ఇడి : బీసీ, ఈబీసీ, కాపుల కోసం ప్రభుత్వం వారి ఆర్థిక అభివృద్ధికి ఏటా అర్హులైన లబ్ధిదారులకు రూ.10 వేలు ప్రకారం అందిస్తోంది. గడిచిన నాలుగేళ్లలో మొత్తం 39,991 మందికి రూ.39.9 కోట్లు విడుదల చేసింది. వైఎస్సార్ ఈబీసీ కింద నాలుగేళ్లలో ఒక్కొక్కరికి రూ.15 వేలు ప్రకారం మొత్తం 33,722 మందికి రూ.50.58 కోట్లు విడుదల చేసింది. కాపు నేస్తం కింద నాలుగు విడతలుగా మొత్తం 25,653 మందికి రూ.38.48 కోట్లు మంజూరు చేసింది.

ప్రశ్న: నియోజకవర్గాల వారీగా మంజూరైన నిధులు గురించి వివరించండి.?

ఇడి : పుట్టపర్తి నియోజకవర్గంలో బీసీలకు జగనన్న చేదోడు కింద 7176 మందికి రూ.7.78 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 6,519 మందికి రూ.9.78 కోట్లు, వైఎస్సార్ కాపు నేస్తం కింద 5,865 మందికి ఈ నాలుగేళ్లలో రూ.8.80 కోట్లు, కదిరి నియోజకవర్గంలో బీసీలకు 6,761 మందికి రూ.6.76 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 6,547 మందికి రూ.9.82 కోట్లు, కాపు నేస్తం కింద 5,689 మందికి 8.53 కోట్లు, ధర్మవరం నియోజకవర్గంలో బీసీలకు 7,272 మందికి 7.27 కోట్లు, ఈబీసీలకు 6,940 మందికి రూ.10.41 కోట్లు, కాపు నేస్తం కింద 4,341 మందికి రూ.6.57 కోట్లు, హిందూపురం నియోజకవర్గంలో బీసీలకు 5,739 మందికి రూ.5.73 కోట్లు, ఈబీసీలకు 5,139 మందికి రూ.7.71 కోట్లు కాపు నేస్తం కింద 2,650 మందికి రూ.3.98 కోట్లు, మడకశిరలో బీసీలకు 4,030 మందికి రూ.4.25 కోట్లు, ఈబీసీలకు 1328 మందికి రూ.1.92 కోట్లు కాపు నేస్తం కింద 2,924 మందికి రూ.4.39 కోట్లు, పెనుకొండ నియోజకవర్గంలో బీసీలకు 6,444 మందికి రూ.6.44 కోట్లు, ఈబీసీలు 4,934 మందికి రూ.7.40 కోట్లు కాపు నేస్తం కింద 3,371 మందికి రూ.5.06 కోట్లు, రాప్తాడు నియోజకవర్గంలో బీసీలు 2,578 మందికి రూ.2.58 కోట్లు, ఈబీసీలు 2,315 మందికి రూ.3.47 కోట్లు, కాపు నేస్తం కింద 813 మందికి రూ.1.22 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది.

డి.సుబ్రహ్మణ్యం బీసీ కార్పొరేషన్, ఉమ్మడి జిల్లాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ప్రశ్న: జిల్లాలో ఎవరు ఏ విధంగా పర్యవేక్షిస్తారు.?

ఇడి : శ్రీ సత్యసాయి జిల్లాలో తమశాఖకు కార్యాలయం లేదు. అనంతపురం జిల్లాలో ఉంది. ఉమ్మడి జిల్లాల పరిధిలో తమ కార్పొరేషన్ పనిచేస్తుంది. జిల్లాలో మండల అభివద్ధి అధికారులు, సచివాలయాల సిబ్బంది నవరత్నాలు అమలులో భాగంగా పర్యవేక్షణ ఉంటుంది. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను గుర్తించి వారు ప్రభుత్వానికి నివేదిస్తారు. నిధులు ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి వెళుతుంది. నూతన జిల్లాలో కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రశ్న:లబ్ధిదారులకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి.?

ఇడి : ప్రభుత్వం బలహీన, వెనుకబడిన వర్గాల సంక్షేమం అభివద్ధి కోసం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకుని అభివద్ధి చెందాలి. అర్హులకు వీటికి దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి తమ శాఖ ద్వారా ప్రభుత్వ సాయాన్ని అందిస్తాం.

జిల్లా ఆసుపత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్

వర్చువల్‌గా పనులను ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోడీ

జిల్లా అసుపత్రిలో శిలఫలకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

నేషనల్ హెల్త్ మిషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రూ.23.25కోట్లతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఆదివారం నాడు గుజరాత్ రాష్ట్రంలోని రాజకోట్‌లో జరిగిన సమావేశం నుంచి దేశ వ్యాప్తంగా హెల్త్ కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, శంకుస్థాపనలు చేశారు. ఇందులో మన రాష్ట్రంలో 9 క్రిటికల్ కేర్ బ్లాక్‌లను వర్చుల్‌గా శంకుస్థాపనలు చేశారు. హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో నిర్మాణం చేస్తున్న 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణం పనులకు శంకుస్థాపనులకు నిధులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రధానమంత్రి సందేశాన్ని ప్రేక్షకులు వీక్షించారు. అనంతరం శంకుస్థాపన శిలాఫలకాన్ని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు సత్యసాయి జిల్లాలోని హిందూపురం జిల్లా ఆసుపత్రిలో పిఎం అభీమ్ ఆధ్వర్యంలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ (సిసిబి) నిర్మాణం (2వ కాల్) మొత్తం:రూ.23.25 కోట్ల నిధులు మంజూరు అయ్యాయన్నారు. భవన నిర్మాణం నాణ్యమైన పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. క్రిటికల్ కేర్ అందుబాటులోకి వస్తే వెంటిలేటర్ పై వైద్యం అందించ వచ్చున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ కు గురైన వారు, రోడ్డు ప్రమాదంలో బారిన పడిన వారికి మెరిగిన వైద్యం అందించవచ్చని చెప్పారు. త్వరలో క్రిటికల్ కేర్ భవన నిర్మాణం పనులు పూర్తిచేసి జిల్లా ప్రజలకు అంకితం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, హిందూపురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, డిఎం అండ్ హెచ్ఒ కృష్ణారెడ్డి, డిసిహెచ్ఒ జితేంద్ర నాయక్, మెడికల్ సుపరింటెండెంట్ రోహిల్ కుమార్, ఆర్ఎంఒ రుక్మిణమ్మ, స్థానిక బిజెపి నాయకులు ఆదర్శ్ కుమార్, వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిని వీడే ప్రసక్తే లేదు : బికె

అధినేత పిలుపుమేరకు విజయవాడకు వెళ్లిన పార్థసారథి

కార్యకర్తలతో మాట్లాడుతున్న బికె.పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ

తెలుగుదేశంపార్టీని వీడే ప్రసక్తే లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథి స్పష్టం చేశారు. పార్టీ అధినేత చంద్రబాబు పిలుపుమేరకు ఆదివారం బికె బెంగళూరు నుంచి విజయవాడకు బయల్దేరి వెళ్లారు. అంతకుముందు ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడి పని చేశానని, ఈ క్రమంలోనే జడ్పీ ఛైర్మన్‌గా, ఎంపిగా రెండు సార్లు ఎమ్మెల్యే గా, సుదీర్ఘకాలంగా జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్నానన్నారు. ఒకే పార్టీ, ఒకే జెండా, ఒకే అజెండాతో ఎప్పటికీ పని చేస్తానన్నారు. నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం బికె ఎంతగానో కృషి చేశారన్నారు. అయితే పెనుకొండ ఎమ్మెల్యే టికెట్ విషయంపై అధిష్టానం ఆయనతో చర్చించకపోవడం బాధాకరమన్నారు. పార్టీ అధిష్టానం పునరాలోచించి ఆయనకే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని కోరారు. దీనిపై పార్థసారధి మాట్లాడుతూ మీ ఆవేదన, అభిప్రాయాలను అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని, అంతవరకూ సంయమనం పాటించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాగా పార్థసారథితో మాజీ మంత్రి పరిటాల సునీత, సీనియర్ నాయకులు ఎల్.నారాయణచౌదరి సమావేశమై చర్చించారు. అనంతరం విజయవాడకు బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా మద్దతుదారులు స్థానిక వై జంక్షన్ వరకూ భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు.

శాస్త్రీయ ఆలోచనతోనే సామాజిక మార్పు

ప్రజాశక్తి-కదిరి టౌన్

శాస్త్రీయ ఆలోచనతోనే సామాజిక మార్పు సాధ్యమని ప్రముఖ చిన్నపిల్లలు డాక్టర్ మదన్‌కుమార్ తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో జిల్లా ఉపాధ్యక్షులు బి.నరసారెడ్డి అధ్యక్షతన పిళ్లా కుమారస్వామి రచించిన 'శాస్త్రీయ ఆలోచన' గ్రంథాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ సివి.మదన్‌కుమార్, న్యాయవాది నరసింహులు, యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, ఎల్ఐసి ఏజెంట్ల సంఘం నాయకులు బయప్ప, జెవివి జిల్లా అధ్యక్షులు ఆదిశేషు, ఇంద్రజాలకులు నబి, రచయిత పిళ్లా కుమారస్వామి, పెన్షనర్ల సంఘం నాయకులు వీరస్వామి పాల్గొన్నారు. నర్సారెడ్డి మాట్లాడుతూ జెవివి ఆధునిక ప్రపంచంలో మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యం చేయడానికి వివిధ రూపాల్లో ప్రయత్నం చేస్తుందన్నారు. మ్యాజిక్ ఫైర్ ప్రదర్శించి ప్రేక్షకులను ఆశ్చర్య చకితుల్ని చేశారు. అనంతరం సైన్సు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీరస్వామి, సైంటిస్ట్ చంద్రాయుడు, సాహితీ స్రవంతి నాయకులు రాజశేఖర్, కదిరి అభివృద్ధి వేదిక నాయకులు చింతా శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు సుబ్బిరెడ్డి, సిపిఎం నాయకులు నరసింహులు, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్‌జాన్, సిఐటియు నాయకులు యాకుబ్‌ఖాన్ పాల్గొన్నారు.

'శాస్త్రీయ ఆలోచన' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ఎమ్మెల్యే కేతిరెడ్డిని సత్కరిస్తున్న భాస్కర్‌రెడ్డి, నరేష్, రమేష్

వైసిపి బలోపేతానికి కృషి చేస్తా

ధర్మవరం టౌన్ : వైసిపి బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానని వైఎస్‌ఆర్ ట్రేడ్ యూనియన్ జిల్లా జనరల్ కార్యదర్శి చింతకాయల నరేష్ పేర్కొన్నారు. ఈ పదవిలో నియమించినందుకు ఆదివారం నరేష్ పట్టణంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నరేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఎంతో నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని తెలిపారు. కార్యక్రమంలో 32వ వార్డు ఇన్‌ఛార్జి భాస్కర్, చిల్లావారి భాస్కర్‌రెడ్డి, టౌన్ క్లస్టర్-2 ఉపాధ్యక్షులు వంక రమేష్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

పుట్టపర్తి క్రైమ్ : ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదివారం కలెక్టర్ అరుణ్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా 'స్పందన' ఉంటుందన్నారు.

నేడు నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమావేశం

మడకశిర : అమరాపురం పట్టణంలోని ఈరన్న నివాసంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే మద్దన కుంట ఈరన్న ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు నియోజకవర్గ టిడిపి, జనసేన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆదివారం టిడిపి అభ్యర్థి డాక్టర్ మద్దనకుంట సునీల్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ

గోరంట్ల : పట్టణంలోని ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మూడో రోజైన ఆదివారం సిరగవాండ్లపల్లి గ్రామంలో అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలు అందరినీ బడిలో చేర్చాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నిరక్షరాస్యులను విద్యావంతులుగా చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భక్తవత్సలం, ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు బాల మోహన్, అధ్యాపక బృందం జునైద్‌బాషా, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఓబుళదేవరచెరువు : మండలంలోని తంగేడుకుంట గ్రామ జడ్పీ హైస్కూల్‌లో 2007-08లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమావేశమయ్యారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రోజంతా ఎంతో ఉత్సాహంగా గడుపుతూ ఒకరినొకరు ఆప్యాయం గా పలకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి వారి గురువులు రాధమ్మ, అమృత వల్లి, రవికుమార్, రమేష్, కరుణాకర్‌రెడ్డిలను సత్కరించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు రాజేంద్ర, అశోక్‌కుమార్, అంజలి, రోహిత్, మున్నిరా, జయచంద్రబాబు, అశోక్ పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం, గురువందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ రామకృష్ణ, అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, రంగనాథ్, సాయిరెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఓబుళదేవరచెరువు : అమడగూరు మండలంలోని గాజులపల్లి గ్రామం కూడలి వద్ద ఉన్న శ్రీమా తృశ్రీ వృద్ధాశ్రమంలో ఆదివారం ఓబుళదేవరచెరువుకు చెందిన నిజాంవలి 52వ జన్మదినం సందర్భం గా ఆశ్రమంలో కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారి షాపు వద్ద ఉంచిన హుండీ ద్వారా ఏడాది నుంచి పోగేసిన రూ. 8,216 అందజేశారు. భవిష్యత్తులో కూడా ఆశ్రమానికి తన వంతు సహకారం ఉంటుందన్నారు. ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి, నిజాంవలి భార్య హసీన, చలపతి నాయుడు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి పుట్టినరోజు చేసుకుంటున్న నిజాంవలి

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

హిందూపురం : విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జ్ఞానం పెంపొందించుకోవాలని రసాయన శాస్త్రంలో డాక్టరేట్ పొందిన డాక్టర్ ఆర్.గంగాధర్, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ప్రసాద్ సూచించారు. ముద్దిరెడ్డిపల్లిలోని బాలయోగిస్వామి ఆశ్రమంలో జెఎన్‌టియు నుంచి రసాయన శాస్త్రం విభాగంలో డాక్టరేట్ పొందిన పట్టణానికి చెందిన డాక్టర్ ఆర్.గంగాధర్‌ను ఆదివారం ముద్దిరెడ్డిపల్లి జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని, చదువులకే పరిమితం కాకుండా సామాజిక, సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ జయరామ్, ముద్దిరెడ్డిపల్లి పాఠశాల, లేపాక్షి గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


డాక్టరేట్ పొందిన గంగాధర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్

వైద్య వృత్తి నుంచి రాజకీయాల్లోకి

32 ఏళ్లకే సునీల్‌కుమార్ రాజకీయ అరంగేట్రం

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి, జనసేన పొత్తులో భాగంగా మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు సునీల్‌కుమార్ మడక శిర(ఎస్సీ) నియోజకవర్గ టికెట్ దక్కించుకున్న విషయం తెలిసిందే. 32 ఏళ్ల సునీల్‌కుమార్ వృత్తి రీత్యా డాక్టర్. నిరుపేదలకు వైద్య సేవలందించి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. అదే తరహాలో రాజకీయంలో కూడా తనదైన ముద్ర వేసి ప్రజాసేవ చేయడానికి టిడిపి అధినేత చంద్రబాబు అవకాశం కల్పించారు. మారుమూల గ్రామీణ ప్రాంతంలో పుట్టిన సునీల్‌కుమార్ వైద్య వృత్తిని ఎంచుకొని తండ్రికి తగ్గ తనయుడిగా ముందుకు సాగుతూ ప్రజాసేవ చేయడానికి కంకణం కట్టుకున్నారు. తండ్రి మాజీ ఎమ్మెల్యే ఈరన్న నియోజకవర్గంలో చంద్రబాబు హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో డాక్టర్ సునీల్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర లో సునీల్‌కుమార్ రాయలసీమ అంతా తిరగడంతో మంచి గుర్తింపు వచ్చింది. పార్టీ అధినేత ప్రకటించిన సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో ముందున్నారని చెప్ప వచ్చు. మాజీ ఎమ్మెల్యే ఈరన్నకు కూడా నియోజకవర్గంలో మృదు స్వభావిగా మచ్చలేని నాయకుడిగా పేరుంది. ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రచారాన్ని ప్రారంభించారు. అవ్వ తాతలను ఆప్యాయంగా పలకరిస్తూ, ట్రాక్టర్ డ్రైవర్, భవన నిర్మాణ కార్మికులను మాట్లాడిస్తూ, కియా పరిశ్రమకు వెళ్లే యువకులతో ముచ్చట్లు చెబుతూ తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

టిడిపి-జనసేన జాబితాలో సామాజిక న్యాయం

మడకశిర : టిడిపి-జనసేన పొత్తులో భాగంగా ప్రకటించిన తొలి జాబితాతో దళితులకు అత్యధిక ప్రాధాన్యత కల్పించి సామాజిక న్యాయం పాటించారని నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఈ జాబితా చూసి వై నాట్ 175 అనే జగన్ తాడేపల్లి ప్యాలెస్ కంపించిందని ఎద్దేవా చేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి-జనసేన ఉమ్మడి జాబితాలో 63 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్, ముగ్గురు డాక్టర్లు, ఓ ఐఎఎస్ అధికారికి అవకాశం కల్పించారన్నారు. అందరూ ఉన్నత విద్య చదివిన వారేనని, కచ్చితంగా గెలిచే అభ్యర్థులకే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సీట్లు కేటాయించారన్నారు. కాపు రిజర్వేషన్ రద్దు చేసినపుడు అంబటి రాంబాబు, పేర్ని నాని ఎక్కడికెళ్లారని ప్రశ్నించారు. మొదటి నుంచి రాజంపేట కాపులకు ఇస్తే వారు వైసిపికి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి కేటాయిస్తే వీళ్లందరూ ఎందుకు ప్రశ్నించలేదన్నారు. 1.3 కోట్ల మందికి పైగా ప్రజాభిప్రాయ సేకరణ మేరకే అభ్యర్థులను ఖరారు చేశారని తెలిపారు. ఆయనతో పాటు జనసేన నాయకులు శివాజీ, టిడిపి నాయకులు అశ్వత్థప్ప, రామాంజనేయులు, రాజగోపాల్, కృష్ణప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిబండ : మండలంలోని జమ్మలబండ, కేకతి, తదితర గ్రామాల్లో సునీల్‌కుమార్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కేకతి గ్రామంలో వైసిపికి చెందిన నాయకులు టిడిపిలో చేరగా పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, సుధాకర్, రాష్ట్ర వక్కలిగ సాధికార సమితి అధ్యక్షులు పాండురంగప్ప, రవిభూషణ్, భోజరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరంలో టిడిపి జెండా ఎగురవేస్తాం : పరిటాలశ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరంలో అరాచక వైసిపి పాలనకు ముగింపు పలికి మీ అందరి ఆశీర్వాదంతో టిడిపి జెండా ఎగురవేస్తానని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మండలంలోని తుంపర్తి గ్రామంలో ఆదివారం వైసిపికి చెందిన 40 కుటుంబాలు పరిటాల శ్రీరామ్ సమక్షంలో టిడిపిలో చేరాయి. శ్రీరామ్ గ్రామంలోకి రాగానే స్థానిక నాయకులు, కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ గజమాల వేసి ఘనస్వాగతం పలికారు. ఆ గ్రామానికి చెందిన ఆంజనేయులు, శ్రీరాములు, వెంకటరాముడు, గంగమ్మ, నాగలక్ష్మీతో పాటు పలువురు టిడిపిలో చేరగా శ్రీరామ్ పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించా రు. కొందరు రైతులు మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు ఇళ్ల స్థలాల కోసం తమ భూములు తీసుకున్నారని, అప్పట్లో న్యాయం చేస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే కేతిరెడ్డి హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే స్పందించకుండా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపితోనే తమకు న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో పార్టీలోకి చేరామని తెలిపారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బాధిత రైతులకు న్యాయం చేస్తామన్నారు. అక్రమంగా భూములు తీసు కున్న వారి నుంచి వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేశారు. టిడిపి శ్రేణులను ఇబ్బంది పెట్టే ఏ ఒక్కరినీ వదలబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యకులు కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి, చింతలపల్లి మహేష్ చౌదరి, మాజీ ఎంపిపి మద్దిలేటి, మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, మాజీ జడ్పీటీసీ రామాంజి నేయులు, గొట్లూరు శ్రీనివాసులు, నర్పంచి ముత్యాలప్పనాయుడు, విజయసారథి, చిగిచెర్ల రాఘవరెడ్డి, రాంపురం శీన, నాగిరెడ్డి, చెన్నారెడ్డి, నారాయణస్వామి, శ్రీనివాసులు, గోవిందరెడ్డి, లక్ష్మీనారాయణ, పోతుకుంట రవి పాల్గొన్నారు.

పరిటాల శ్రీరామ్ సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

తాళపత్ర శాసనాలకు ప్రతిశాసనాలు గుర్తింపు

వెల్లడించిన చరిత్రకారుడు మైనాస్వామి

ప్రజాశక్తి-కదిరి టౌన్

అరుదైన తాళపత్ర శాసనాలకు ప్రతి శాసనాలను గుర్తించినట్లు చరిత్రకారుడు మైనా స్వామి తెలిపారు. శాసనాలు రాతి బండలు, రాగి రేకులపై ఉంటాయి. తాళపత్రాలపై శాసనాలను రాయడం అత్యంత అరుదైన విషయమని కదిరికి 13కి.మీ. దూరంలోని పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి గుడికి సంబంధించిన అంశాలను తెలిపే తాళపత్ర శాసనాలకు నకలు శాసనాలను చరిత్రకారుడు మైనాస్వామి ఆదివారం బయటపెట్టారు. నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె గ్రామానికి చెందిన పత్రాకుల గురువు వంశానికి చెందిన పత్రా రామకృష్ణ అభ్యర్థన మేరకు మైనాస్వామి శాసనాన్ని చదివి విశ్లేషించా రు. ఒక వెదురుబొంగులో రెండు దళసరి తాళ పత్రాలు ఉన్నాయని, వాటిని ప్రతి శాసనాలుగా గుర్తించామన్నారు. విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన సంగమ వంశ ప్రభువు రెండో విరూపాక్ష రాయలు కుమారుడు రెండో ప్రౌఢదేవరాయలు సామాన్య శకం 1474 జయ నామ సంవత్సరం మాఘశుద్ధ ద్వాదశి గురువారం నాడు పత్రాకుల గురువు సోమినాయుడుకు రాయించి ఇచ్చిన శాసనమని చరిత్రకారుడు విశ్లేషించారు. పెనుకొండ రాజ్యం ఎరమంచినాడులోని కదిరి కుటాగుళ్ల సీమలో సోమినాయుడును కులగురువుగా నియమిస్తూ ప్రభువు ప్రౌఢదేవరాయలు శాసనం రాయించినట్టు మైనాస్వామి వివరించారు. పెద్ద పత్రంలో శివప్రశస్తి, పై భాగంలో భైరవుడు, శివ లింగం, ఆంజనేయస్వామి చిత్రాలు ఉన్నాయి. అందులో సంస్కృతం, తెలుగు భాషలున్నాయి. తిరుపతి సమీపంలోని చంద్రగిరి మల్లికార్జునస్వామి గుడి, పాలపాటిదిన్నె వీరాంజనేయస్వామి వంటి విషయా లున్నాయని చరిత్రకారుడు తెలిపారు. శివప్రశస్తి శాసనాన్ని ఆదినారాయణస్వామి రాయగా, రంగానాయని నరసింహనాయుడు నకలును రూపొందించారన్నారు. శివప్రశస్తి పత్రంలో వీరాంజనేయ స్వామి పూజలు, ప్రసాదాలు, రేవణసిద్ధ గురుస్వాముల గురించి ఉందని మైనాస్వామి తెలిపారు.



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి అమర్ నాథ్

పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్న మోడీ ప్రభుత్వం

ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారుల కొమ్ముకాస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అంగట్లో సరుకులి అమ్ముతున్నారని ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్ విమర్శించారు. అధిక ధరల నియంత్రణ, విద్య, వైద్య రంగాల ప్రయివేటీకరణ, ఎన్‌ఈపి-2020ని రద్దు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, కార్మికులు, రైతుల సమస్యలు, మహిళలపై దాడులు అరికట్టాలని, తదితర 13 డిమాండ్లపై సంతకాలు సేకరించి, ఆదివారం పట్టణంలోని ఐఎంఎ హాలులో ఎస్‌యుసిఐ ఆద్వర్యంలో ప్రజా సమస్యలపై సదస్సు నిర్వహించారు. అమర్‌నాథ్ మాట్లాడుతూ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారుల కొమ్ము కాస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు కూడా ప్రజా సమస్యలను విస్మరించాయన్నారు. బిజెపికి జీ హుజూర్ అంటూ ఊడిగం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వారికి ఓట్లతో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సదస్సులో జిల్లా కార్యదర్శి ఎం.గిరీష్, జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణారెడ్డి, అశోక్, మల్లిక్ దత్‌కుమార్, సుమలత, రవీంద్ర, కీర్తి, సంజీవరాయప్ప పాల్గొన్నారు.

పల్లె సమక్షంలో టిడిపిలోకి చేరిన నాయకులు

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం : పల్లె

ప్రజాశక్తి-నల్లమాడ

వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని, కావు జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కురుమాల గ్రామపంచాయతీ గంగాపురం, చౌటుకుంటపల్లి గ్రామాల్లో ఆదివారం పల్లె ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రకటించిన సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే సమస్యలు తెలుసుకుని టిడిపి అధికారంలో రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయా గ్రామాల్లో టిడిపి నాయకులు, ప్రజలు పల్లెకు ఘన స్వాగతం పలికారు. పల్లె సమక్షంలో మండలంలోని చారుపల్లి గ్రామపంచాయతీ రెడ్డిపల్లి గ్రామంలో ఐదు కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు.

చెట్ల నరికివేతను అడ్డుకున్న పర్యావరణ ప్రేమికులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంతో పాటు జిల్లా వ్యాప్తంగా అటవీశాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనలను విస్మరించి, ముడుపులు తీసుకుని మహా వృక్షాలను సైతం నరకడానికి అనుమతులు ఇస్తున్నారని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని విడి రోడ్డులో పురపాలక సంఘ రోడ్డులో ఉన్నా మహా వృక్షాలను తొలగించేందుకు అటవీశాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. దీంతో ఆదివారం కొందరు ఆ చెట్లను నరకడానికి సిద్ధం కాగా విషయం తెలుసుకున్న పర్యావరణ ప్రేమికులు డాక్టర్ భాస్కర్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. జిల్లాలో ఎక్కడా చెట్ల నరికివేతలో నిబంధనలు పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం హిందూపురం రూరల్ మండలం చెర్లోపల్లి అడవుల్లో చెట్లు కాలిపోతున్నాయని ఫిర్యాదు చేసినా స్పందించలేదని వాపోయారు. చెట్ల నరికివేతపై అటవీశాఖ అధికారులు ఇచ్చిన అనుమతులపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న వృక్ష సంరక్షులు

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపుదాం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు సమయం ఆసన్న మైందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ పేర్కొన్నారు. పట్టణం లోని 19వ వార్డులో ఆదివారం పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్, మినీమేనిఫెస్టోలోని పథకా లను ప్రజలకు వివరించారు. వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఓ పక్క రూ. 10 ఇస్తూ మరో పక్క రూ. 100 వసూలు చేశారన్నారు. రాష్ట్రంలో రామరాజ్యం రావాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో బీరే గోపాలక్రిష్ణ, భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, అంబటి సనత్, రాళ్లపల్లి షరీఫ్, గోసాల శ్రీరాములు, అత్తార్ రహీంబాషా, కరెంటు ఆది, మారుతిస్వామి, మాధవరెడ్డి, కుళ్లాయప్ప, గంగారపు రవి, క్రిష్ణమూర్తి, తొగట అనిల్, వాసుదావ, స్వర్ణకుమారి, మున్ని, భాను, ఇందిరా పాల్గొన్నారు.

19వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కదిరి టౌన్

తలుపుల మండలంలోని పులిగిండ్లపల్లి హరిజనవాడకు చెందిన పలువురు ఆదివారం గుంత జయ రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని వైసిపి ఇన్‌ఛార్జి అహ్మద్ నివాసంలో వైసిపిలో చేరారు. వారికి వైసిపి సమన్వయకర్త బిఎస్.మక్బుల్, హిందూపురం ఎంపి అభ్యర్థి బోయ శాంతమ్మ వారికి కండువా వేసి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. చేరిన వారు మాట్లాడుతూ జగన్ ప్రవేశపెట్టిన సంక్షే మ పథకాలకు ఆకర్షితులై వైసిపిలో చేరామన్నారు. కార్యక్రమంలో కళ్యాణ్‌కుమార్, పవన్‌కుమార్, సుమిత్ర, జయమ్మ, రాజశేఖర్, శ్రీకాంత్, రామాంజనేయులు, అంజనమ్మ, ఓబుళప్ప, శ్రీరాములు, చెన్నమ్మ పాల్గొన్నారు.

కోటేశ్వరస్వామి సన్నిధికి చేరిన వైసిపి పాదయాత్ర

ధర్మవరం టౌన్ : వైసిపి మళ్లీ అధికారంలోకి రావాలని, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావాల ని ఆకాంక్షిస్తూ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చందమూరి నారాయణరెడ్డి నేతృత్వంలో ధర్మవరం పట్టణం నుంచి చేపట్టిన పాదయాత్ర ఆదివారం తాడిమర్రి మండలంలోని చిల్లవారిపల్లి కోటేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. పాదయాత్రలో పట్టణ అధ్యక్షులు కోటిరెడ్డి బాలిరెడ్డి, కౌన్సిలర్ పెనుజూరి నాగరాజు, గజ్జల శివ, నాయకులు తొండమాల రవి, కృష్ణమూర్తి, చెలిమి పెద్దన్న, చందమూరి రాజ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. చందమూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నడూ లేని రీతిలో సిఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు బురద చల్లడం తగదని హితవు పలికారు. నియోజకవర్గంలో వర్గాలు, కుల మతాలు, రాజకీయపార్టీలకు అతీతంగా నవరత్నాలు అందించారన్నారు. ఇప్పటికే వేలాది మందికి ఇంటి పట్టాలు ఇచ్చామని, డ్వాక్రా మహిళలకు లోన్లు, ఉపాధి హామీ పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకెళ్తుందని తెలిపారు.

సజావుగా గ్రూప్-2 పరీక్ష

పెనుకొండ : పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో జరిగిన గ్రూప్-2 పరీక్ష సజావుగా ముగిసింది. మొత్తం 300 మంది అభ్యర్థులకు గాను 251 మంది పరీక్షకు హాజరయ్యారని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆదిశేషారెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ మాధవరెడ్డి, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ పరిశీలించారు. పరీక్ష కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ వెంట సిఐ యుగంధర్, ఎస్ఐ రాజేష్ ఉన్నారు.

నేరాలు ఘోరాలు

గుండెపోటుతో ఆటో కార్మికుడు మృతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే చంద్ర(46) గుండెపోటుతో మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వివరాలు.. చంద్ర ఉదయం పుట్టపర్తి నుంచి అనంతపురం లోని కేశవరెడ్డి పాఠశాలకు ఆటోలో ప్రయాణికులను తీసుకెళ్లాడు. ఆటోలో వెళ్లిన వారు పాఠశాలలో తమ పిల్లలను కలిసిన అనంతరం భోజన సమయంలో వారితో పాటు చంద్ర కూడా భోజనం చేశాడు. అనంత రం స్పృహ తప్పి పడిపోయా డు. అక్కడ ఉన్న గమనించి వెంటనే ఛాతిపై నొక్కుతూ ఆయనకు ఫిజియో థెరపీ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో వారు అతని బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చంద్ర (ఫైల్‌ఫోటో)

లారీ ఢీకొని బాలుడు...

లేపాక్షి : మండలం పరిధిలోని కంచిసముద్రం గ్రామంలో ఆదివారం సాయంత్రం విషాద ఘటన చోటు చేసుకుంది. లారీ ఢీకొని రెండేళ్ల బాలుడు మరణించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కంచిసముద్రం గ్రామానికి చెందిన నందిని, నరసింహప్పల ఏకైక కుమారుడు లోహిత్ (2) ఇంటి బయట ఆడుకుంటూ ఉన్నాడు. ఈ సమయంలో ఇంటి ముందు ఉన్న రోడ్డుపై వెళ్తున్న లారీ బాలున్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో లోహిత్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటన కుటుంబ సభ్యులు బాలున్ని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుమారుని మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారుడికి గాయాలు

ముదిగుబ్బ : స్థానిక దొరిగల్లు రోడ్డులో ఆదివారం ఫ్లై ఓవర్ సమీపనంలో లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో తండ్రి, కుమారులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. బోడన్న కొట్టాల గ్రామానికి చెందిన నరసింహులు, అతడి కుమారుడు నరసింహులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వీరు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై ముదిగుబ్బ వైపు వస్తుండగా లారీ ఢీ కొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే టౌన్ సిఐ యతీంద్ర సూచనల మేరకు జమేదారు ఇస్మాయిల్, కానిస్టేబుల్ నరసింహులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని పాముదుర్తి 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ యతీంద్ర తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

కదిరి టౌన్ : ఓ హత్యాయత్నం కేసులో నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు సిఐ పుల్లయ్య తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు.. మహమ్మద్ షకీల్, అశ్వాక్ స్నేహితులు. పాత కక్షలు మనసులో పెట్టుకొన్న అశ్వాక్ మహమ్మద్ షకీల్‌ను అంతమొందించేందుకు కుట్ర పన్నాడు. పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఈ నెల 21వ తేదీ అశ్వాక్ ఫ్రూట్ షాపులో ఉన్న పదునైన కత్తి తీసుకోని మహమ్మద్ షకీల్‌పై దాడిచేసి గొంతుపై పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం షకీల్‌ను బెంగళూరుకు తరలించారు. మహమ్మద్ షకీల్ తండ్రి మహమ్మద్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అశ్వాక్ ను అరెస్ట్ చేసి పుట్టపర్తి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు.

గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నేత మృతి

గుడిబండ : కాంగ్రెస్ పార్టీ మండల మాజీ కన్వీనర్ వరదరాజులు ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని రాళ్లపల్లి గ్రామానికి చెందిన ఆయన ఆదివారం ఈ నెల 26వ తేదీ అనంతపురంలో జరిగే కాంగ్రెస్ బహిరంగ సభకు సంబంధించి రాళ్లపల్లి పంచాయ తీలోని వివిధ గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసేందుకు వెళ్లాడు. మదిగుబ్బ గ్రామంలో పర్యటిస్తున్న వరదరాజుకు ఉన్నఫళంగా గుండెనొప్పి రావడంతో ద్విచక్ర వాహనంపై నుంచి కిందికి పడిపోయాడు. తోటి పార్టీ నాయకులు ప్రయివేటు వాహనంలో మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే సిడబ్ల్యుసి సభ్యులు ఎన్. రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వరదరాజు మృతి విషయం తెలియడంతో వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాళ్లపల్లి గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళు లర్పించిన వారిలో సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధా కర్, అనంతరాజు, శివకుమార్ ఉన్నారు.

టిడిపిని గెలిపించండి : కందికుంట

కదిరి టౌన్ : వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని నియోజక వర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలో ఆదివారం కందికుంట ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా కందికుంటకు గ్రామస్తులు, టిడిపి నాయకులు పూలమాల వేసి స్వాగతం పలికా రు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. వైసిపి అరాచక పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేదుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బంగారు కృష్ణమూర్తి, శంకర, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటాగుళ్లలో ప్రజలతో మాట్లాడుతున్న కందికుంట

'శ్రీజ్యోతి' విద్యార్థుల అద్భుత ప్రతిభ

బత్తలపల్లి : ఉమ్మడి అనంతపురం జిలాలో ఆదివారం నిర్వహించిన గణితం అబాకస్, వేదిక్ పోటీల్లో బత్తల పల్లికి చెందిన శ్రీజ్యోతి హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభను చాటారు. అనంతపురం నగరంలోని నవతా స్కూల్‌లో నిర్వహించిన పోటీలకు 40 పాఠశాలల నుంచి 2వేల మంది విద్యార్థులు హాజరు కాగా శ్రీజ్యోతి హైస్కూల్ విద్యార్థులు 15 మంది పాల్గొన్నారు. సీనియర్ అబాకస్ లెవెల్-1లో అర్జున్, జూనియర్ వేదిక్‌లో తీర్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు మార్చి 10వ తేదీ విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, మిగిలిన 13 మంది ప్రథమస్థాయిలో నిలిచారని హెచ్ఎం మిడతల లక్ష్మీనారాయణ తెలిపారు. చిన్నారుల అద్భుతమైన ప్రతిభను, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యా యుడు రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ధర్మతేజ, ఉపాధ్యాయులు నాగపెద్దిరాజు, శంకరయ్య, కాటమయ్య, ఆదెప్ప, వెంకటపతి పాల్గొన్నారు.

ప్రతిభచాటిన శ్రీజ్యోతి హైస్కూల్ విద్యార్థులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

పుట్టపర్తి అర్బన్ : టిడిపి అధినేత చంద్రబాబు రాజకీయ అరంగ్రేటం చేసిన రోజు సందర్భంగా ఆదివారం టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆది నారాయణ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ సర్కిల్‌లో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సామకోటి మాట్లాడుతూ చంద్రబాబు ఆశయం మేరకు అన్నా క్యాంటీన్ ప్రారంభించి 19 రోజులైందన్నారు. చంద్రబాబు 1978 ఫిబ్రవరి 25వ తేదీ రాజకీయ అరంగేట్రం చేశారన్నారు. కార్యక్రమంలో బైరాపురం సర్పంచి రవికు మార్, బేకరీ నాయుడు, చంద్ర, బాషా, చెన్నప్ప, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సామకోటి, టిడిపి శ్రేణులు